
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

మంగళవారం 26 ఆగస్టు 2025



అంగన్‌వాడీల్లో ఆకుకూరల సాగు..



- పోషణ వాటిక ద్వారా నిధులు, విత్తనాలు
- ఒక కేంద్రానికి రూ.10వేల నిధులు

జిల్లాలో పోషన్ వాటిక కేంద్రాలు

మండలం	కేంద్రాలు
బోయినపల్లి	9
చందుర్తి	6
ఇల్లంతకుంట	25
గంభీరావుపేట	12
కోనరావుపేట	10
ముస్తాబాద్	20
రుద్రంగి	7
సిరిసిల్ల	3
తంగళ్లపల్లి	16
వీర్నపల్లి	7
వేములవాడ రూరల్	12
వేములవాడ	9
ఎల్లారెడ్డిపేట	17
మొత్తం	153

జిల్లాలో 153 కేంద్రాల గుర్తింపు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పోషకాహార కేంద్రాలుగా ఉన్న అంగన్‌వాడీల్లో సేంద్రీయపద్ధతుల్లో ఆకుకూరలు, కూరగాయల సాగుకు చర్యలు చేపట్టారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని మరింత నాణ్యతగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పోషణవాటిక' కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న స్థలాల్లో ఆకుకూరలు, కూరగాయలు పండించే విధంగా ఇప్పటికే విత్తనాలను సరఫరా చేశారు. దీంతోపాటు అవసరమయ్యే నిధులు కూడా పోషన్ వాటిక ద్వారానే అందించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలకు ఉద్యానవన శాఖ ఆకుకూరలు, కూరగాయలు పండించే విధానంపై అవగాహన కల్పించనున్నారు. నిరంతరం ఉద్యానవన శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. సిరిసిల్ల జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దాదాపుగా 39726 మంది లబ్ధిదారులు పోషకాహారం పొందుతున్నారు. ఇందులో ఆరోగ్యలక్ష్మి ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు 22,239 మంది సంపూర్ణ భోజనం పొందుతున్నారు. మరో 17487మంది మూడు సంవత్సరాల లోపు చిన్నారులు బాలామృతం, టెక్ హోమ్‌రేషన్ ద్వారా కోడిగుడ్లు అందిస్తున్నారు. సంపూర్ణ భోజనం మరింత నాణ్యతగా అందించడానికి పోషన్ వాటిక పథకం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 587అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 258కేంద్రాలకు సొంతభవనాలు ఉండగా, 152 కేంద్రాలు అద్దె భవనాలు కొనసాగుతున్నాయి.177 కేంద్రాలు ప్రాథమిక పాఠశాల గదులు నిర్వహిస్తున్నారు. సిరిసిల్ల ప్రాజెక్టులో 362 కేంద్రాలు ఉండగా 131 కేంద్రాలకు సొంతభవనాలు ఉండగా 100కేంద్రాలు అద్దె భవనాలు, 131ప్రాథమిక పాఠశాల గదుల్లో కేంద్రాల కొనసాగుతున్నాయి. వేములవాడ ప్రాజెక్టు పరిధిలో 225 కేంద్రాలు ఉండగా 127 కేంద్రాలకు సొంత భవనాలు,52 కేంద్రాలు అద్దె భవనాల్లో, 46 కేంద్రాలు ప్రాథమిక ...

- మిగతా 8లో

29న జిల్లా స్థాయి యోగా ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యోగా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యసాయి సేవా మందిరం ఆవరణలో జిల్లా స్థాయి యోగా (సీనియర్స్) ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. విజేతలను ఈ నెల 30 హైదారాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్న యువతీ యువకులు, పురుషులు, మహిళలు అర్హులని తెలిపారు. వయస్సుల వారీగా వివిధ విభాగాలలో పోటీపడే క్రీడాకారులు డ్రెస్ కోడ్‌తో పోటీలలో పాల్గొనాలని తెలిపారు. సెల్: 9704142212, 9177228502లో సంప్రదించాలని సూచించారు.

ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్న ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ బోనాల రోజ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తుందన్నారు. మంత్రి సీతక్క సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఆన్‌లైన్ ద్వారా ఐఐటి, నీట్ ఫౌండేషన్ కోర్సులు అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, సంధ్యారాణి, శిరీష ఉపాధ్యాయులు ఉన్నారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సిరిసిల్లలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా,ఎస్పీ

సిరిసిల్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలో మానేరు తీరంలోని ప్రేమ్‌నగర్ బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీ మహేష్ బి గితే పలు శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ వినాయక మంట పాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులు చేయించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, నీటి పారుదల శాఖ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

చదువుపట్ల ఏకాగ్రతను పెంపొందించుకోవాలి

- ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి వీ రమణారావు



మొక్క నాటుతున్న ఇంటర్మీటియట్ బోర్డు ప్రత్యేక అధికారి వీ రమణారావు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుపట్ల ఏకాగ్రతను పెంపొందించుకోవాలని ఇంటర్మీటియట్ బోర్డు ప్రత్యేక అధికారి వీ రమణారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ముందుగా కళాశాల ఆవరణలో రమణారావు విద్యార్థినిలతో కలసి మొక్క నాటారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థినిలు అనవసరమైన విషయాలను గురించి ఎక్కువగా ఆలోచించకూడదని చదువుపై దృష్టి పెట్టాలని అన్నారు. పరీక్షలు అనగానే భయం వీడాలని ప్రశాంతమైన మనస్సుతో ఏకగ్రతతో చదివాలని పరీక్షలను రాయాలని విజయాలను సాధించాలని సూచించారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో మంచి అలవాట్లను కలిగి ఉండాలన్నారు. అనంతరం అకాడమీకి సంబంధించిన కొన్ని విషయాలను అధ్యాపకులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాలప్రిన్సిపాల్, జీ వనజాకుమారి, అధ్యాపకులు సీతారాము, కే సునీత, శ్రీనివాస్, ప్రవీన్‌కుమార్, నవీన్‌కుమార్, జబీఉల్లా, ఎం సునీత, గంగరాజు, షాహిదా, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలి

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజారావు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టల్స్‌లలో రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజారావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు శిథిలావస్థలోఉన్న పాఠశాలభవనాలను వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. హాస్టల్స్‌లలో ఇరుకు గదులలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేసి నిరుపేద విద్యార్థులను అదుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యాన్‌లు, లైట్లు లేక విద్యార్థులు చీకటి గదులల్లో ఉక్కపోతలో చదువుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కారించాలన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూజం కార్తీక్, సాయితేజా, శివ, సిద్ధార్థ్, మహేష్, గణేష్, విజయ్, మనోజ్, శివ, శ్రీనివాస్, ధనూష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టడిన వారికి స్థానం కల్పించాలి



మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం ఇస్తున్న పసుల వెంకటి

ఇల్లంతకుంట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం ఇవ్వాలని మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి సోమవారం రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. జనహిత పాదయాత్రలో భాగంగా చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టి కాంగ్రెస్ నాయకులు జైలుపాలు అయ్యారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు తదితర పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్‌పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ అల్లెపు రజనీకాంత్ ఉన్నారు.

వేములవాడలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ నేడు

- బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ

వేములవాడ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మోదీ జన్మదినం పురస్కరించుకుని ఈ నెల 26న పట్టణంలో నిర్వహించే ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి బీజేపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమ స్థలాన్ని సోమవారం బీజేపి నాయకులతో కలిసి పరిశీలించారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న అశా వర్కర్‌లు



జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. సమస్యలు పరిష్కరించాలని అశావర్కర్‌లు, బిల్డింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం సీఐటీయూ అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ అశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాలనుంచి అశావర్కర్‌లు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఏవో రాంరెడ్డితోపాటు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజితలకు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అశావర్కర్లు దేవాలక్ష్మీ, రేణుక, జయశ్రీ, గాయత్రి, లక్ష్మీకాంత, గౌతమి, రజిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

- బిల్డింగ్ వర్కర్స్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం, మట్టి కొరత లేకుండా చూడటంతో పాటు తక్కువ ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిట్టపల్లి రాజమల్లు, ఎగమంటి ఎల్లారెడ్డిలు డిమాండ్ చేశారు. జిల్లా కార్మికశాఖ అధికారి నజీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గుంటుక నరేందర్, గీస భిక్షపతి, మిల్లర్ దేవయ్య, సావనపెల్లి ప్రభాకర్, గురుజాల శ్రీధర్, మల్లేశం, రాపెల్లి రమేష్, బడుగు లింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు నేతన్న పొదుపు డబ్బుల పంపిణీ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో చేనేత, వస్త్ర పరిశ్ర మల్లో పనిచేసే మరమగ్గాల కార్మికులు పొదుపు చేసుకున్న నేతన్న పథకానికి సంబంధించిన రూ. 24 కోట్లు 80లక్షలను మంగళవారం పంపిణీ చేసేందుకు చేనేత జౌళీశాఖ అధికారులు ఏర్పాట్లు చేసినట్లు చేనేత జౌళీశాఖ ఏడీ రామారావు సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో కే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు నేతన్న పొదుపు, నేతన్న బీమా, చేనేత సంఘాలకు రుణాల రిన్యువల్ చేసే కార్యక్రమాన్ని సైతం చేపడుతున్నట్లు తెలిపారు. నేతన్న పొదుపు (త్రిఫ్ట్) పథకం కింద మూడు సంవత్సరాలకాలానికి జిల్లాలో వస్త్ర పరిశ్రమకు చెందిన 4,963 మంది కార్మికులకు రూ.24 కోట్ల 80లక్షలను పంపిణీ చేయనున్నారు. అలాగే నేతన్న బీమాలో 12 మంది కార్మిక కుటుంబాల నామినీలకు ఒక్కొక్క రికి రూ.5 లక్షల చొప్పున రూ 60లక్షలు పంపిణీ చేయనున్నారు. రెండు చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ కింద రుణాలు రెన్యువల్ చేసే పత్రాలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసి నట్లు ఏడీ తెలిపారు.

నేడు కోనరావుపేటలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

కోనరావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని నిమ్మపల్లి ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఆవిష్కరించనున్నట్లు మండల గౌడ సంఘం అధ్యక్షుడు అబ్బసాని శంకర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరిస్తారని ఈ కార్యక్రమాన్ని గౌడ సంఘం, బీసీ సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్ గౌడ్, దొంతరవేణి శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పొన్నం పరశురాములు, ముష్ణం అంజయ్య, తాళ్లపెల్లి తిరుపతి, వికృతి మధుకర్ గౌడ్ ఉన్నారు.

పోలీస్‌శాఖపై నమ్మకం కలిగేలా గ్రీవెన్స్ డే

- ఎస్పీ మహేశ్ బి. గీతే



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖపై నమ్మకం కలిగేలా గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 29 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్‌డే ఉపయోగపడుతుందన్నారు. అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశించామన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా , ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు స్వీకరించా లన్నారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సాధ్యమైనంత త్వరగా వాటిని ప్రజల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దశరథం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం నుంచి తాడూరు గ్రామానికి వెల్లే 33.6 ఫీట్ల రోడ్డును ఆక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌టీ యూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అధికా రంలోకి రాగానే బీఆర్ఎస్ నాయకుల అవినీతి బాగోతాలను బట్టబయలు చేస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ నాయకుల మౌనం వెనకాల అనుమానాలు కలిగిస్తున్నాయని అన్నారు. సిరిసిల్ల విద్యానగర్ నుంచి తాడూరు గ్రామానికి వెళ్లే రోడ్డును ఓ బీఆర్ఎస్ నాయకుడు ఆక్రమించి జీప్లస్ ఫైవ్ బిల్డింగ్ నిర్మిస్తున్నా అధికారులు, కాం గ్రెస్ ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. మొన్నటి వరకు సెస్ అవినీతి ఆధారాలతో బయటపెట్టిన అధికారులు, కాంగ్రెస్ నాయకులు మౌనం పాటిం చడం వలన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నాయకుల భాగస్వామ్యం ఉందని అనుమానిం చాల్సి వస్తోందన్నారు. సిరిసిల్లలో ప్రభుత్వ భూములు వేల ఎకరాలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించిన అధికార పార్టీ నాయ కులు ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల భూములు తిరిగి స్వాధీనం చేసుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు చర్య లు తీసుకోవాలన్నారు. తాడూరు రోడ్డును ఆక్ర మించిన కట్టడాలను వెంటనే నిలిపివేయాలని లేకుంటే ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. ఈ సమా వేశంలో నాయకులు గుజ్జ దేవదాస్, తడుక రాములు, ఆకలి సత్తయ్య, టీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రూ.7650 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7650 పలికింది. సోమవారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 10క్వింటాళ్లు విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7650 చెల్లించారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన రాళ్లబండి సత్యనారాయణ ఆగస్టు16న కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈమేరకు కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యజమాని సత్యనారాయణకు కరీంనగర్‌రూరల్ ఠాణాలో సోమవారం సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు. ఫోన్‌ను పట్టుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తివాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కాల్వల శివకుమార్‌పై కేసునమోదుచేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

వృద్ధురాలిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

చొప్పదండి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని 13వవార్డులో పంచల భాగ్యలక్ష్మి(65) ప్రమాదవశాత్తు చేదబావిలో పడింది. సమాచారం అందుకున్న చొప్పదండి ఫైర్‌స్టేషన్ అధికారి పవన్ సిబ్బందితో కలిసి బావివద్దకు చేరుకుని వృద్ధురాలిని రక్షించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

వీణవంక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామశివారులో సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో దంపతులకు గాయాలయ్యాయి. హిమ్మత్‌నగర్ గ్రామానికిచెందిన ఉండాటి సారయ్య తన భార్యతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామశివారులో రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో అదుపుతప్పి దంపతులిద్దరూ బైక్ నుంచి కింద పడిపోయారు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్సనిమిత్తం జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన మహిళ

ఉపాధిహామీలో సీసీ రోడ్లకు స్వస్తి


కందుగుల గ్రామంలో పశువుల పాక నిర్మాణానికి ముగ్గు పోస్తున్న ఆర్డీవో రమేష్‌బాబు

- కేంద్ర బృందం హెచ్చరికలతో మారిన పనుల ఎంపిక తీరు
- రైతులకు లబ్ధి చేకూర్చే పనులకే ప్రాధాన్యం

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులను ఆసరాగా తీసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతుండడాన్ని పరిశీలించిన కేంద్ర బృందం పనుల ఎంపిక తీరును పూర్తిగా మార్చింది. సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు ఇవ్వబోమని హెచ్చరించడంతో ఈ సారి ఉపాధి పనుల తీరు మారనున్నాయి.

రోడ్ల నిర్మాణాల్లో భారీ అక్రమాలే కారణమా..?

ఉపాధి హామీ పథకం నిధులను ఏటా సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించడం పరిపాటైపోయింది. ఈ రోడ్ల నిర్మాణంలో అంతే స్థాయిలో అక్రమాలు సాధారణమైపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్ కింద అందుబాటులో ఉన్న ఉపాధి హామీ నిధుల్లో 80 శాతం వరకు సీసీ రోడ్లకే వెచ్చించే వారు. స్థానిక గ్రామపంచాయతీల తీర్మానాల పేరుతో మొక్కుబడి పనులు చేయడం, లక్షల్లో నిధులు నొక్కేయడం పరిపాటిగా మారింది. రెండు, మూడు దశాబ్దాలపాటు ఉండాల్సిన సీసీ రోడ్లను నాసిరకంగా నిర్మించడంతో రెండు, మూడేళ్లకు పగుళ్లు రావడం, కంకర తేలి కనిపిస్తుండడాన్ని కేంద్ర బృందం గమనించింది. దీంతో కేంద్ర బృందం ఈ సారి సీసీ రోడ్లకు కేటాయింపులు తగ్గించాలని ఆదేశించింది.

వ్యవసాయ అనుబంధ పనులివే...

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద వ్యవసాయ కూలీల వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద వచ్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధులను పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, పౌల్ట్రీఫాంలు, నాడెపు కంపోస్టు షెడ్లు, అజోలా ట్యాంకులు, చెక్ డ్యాంలు, నీటి కుంటలు వంటి పనులకు వెచ్చిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనుల జాతర పేరుతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, పీఆర్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటిసరఫరా, స్వచ్ఛభారత్ మిషన్ తదితర విభాగాల సమన్వయంతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించింది. ఇందులో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మురుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు. హుజూరాబాద్ మండలంలో 88.78 లక్షలతో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు.

ఎంపిక చేసిన పనులను ప్రారంభిస్తాం..

తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్



ఉపాధిహామీ పనుల జాతర కింద ఆయా గ్రామాల్లో గుర్తించిన పనులు చేపట్టనున్నాం. అత్యంత పారదర్శకంగా పనులు జరిగేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి హామీ పథకం కింద గ్రామాలకు లబ్ధి చేకూరే పనులకు శ్రీకారం చుట్టాం.

మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న గ్రామస్థులు

మానకొండూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను గ్రామస్థులు పట్టుకున్నారు. కొంత కాలంగా గట్టుదుద్దెనపల్లి-పోలంపల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దగుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా సోమవారం గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌ఐ ప్రీతి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ టిప్పర్‌లను సీజ్‌చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గ్రామస్థులు పెంచాల రాజయ్య, ఆకుల నర్సింగరావు, కనకం కుమార్, పాండ్రాల కనుకరాజేశం, గొండ తిరుపతి ఉన్నారు.


పట్టుకున్న వాహనాలతో గ్రామస్థులు

పొలంలో జారి పడి రైతు మృతి

మల్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం నూకపల్లిలో పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన గంగారాం (75) అనే రైతుకు సోమవారం ఛాతి నొప్పిరావడంతో బురదలో కూరుకుపోయి మృతిచెందాడు. ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం రెండు రోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని తన పంటచేను వద్దకు వెళ్లిన గంగారాం పంప్‌సెట్ వద్ద మోటార్ స్టార్ట్ చేస్తుండగా ఛాతిలో మళ్లీనొప్పి రావడంతో అక్కడే పొలం బురదలో బోర్లపడి కూరు కుపోయాడు. దీంతో ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కాంతవ్వ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


గంగారాం(ఫైల్)

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా బిక్కవోలు మండలం పూలపల్లి గ్రామానికి చెందిన అంతరాష్ట్ర దొంగ అంబటి రాంబాబు (41)ని సోమవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.... రాంబాబు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకొని ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. కాకినాడలో 2019లో ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడగా అడ్డువచ్చిన ఇద్దరు వ్యక్తులను రాంబాబు హత్య చేసి జైలు కు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత హైద్రాబాద్‌కు మకాం మార్చి ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తున్నాడు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన మండ్రు నారాయణ ఉద్యోగ నిమిత్తం జూన్ 1న సిరిసిల్లకు ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి కరీంనగర్‌కు వెలుతుండగా మార్గమధ్యలో వెంకట్రావుపల్లి వద్ద గల హోటల్ వద్ద పార్క్‌చేసి టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ చేసి తిరిగి వచ్చే వరకు నారాయణ ద్విచక్ర వాహనం కనిపించలేదు. ఈ మేరకు బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా సాంకేతికత ఆధారంగా ద్విచక్రవాహనాల దొంగ అంబటి రాంబాబును హైద్రాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా దొంగ తనం చేసినట్లు అంగీకరించాడు. నాలుగు సంవత్సరాలుగా 22ద్విచక్రవాహనాలు దొంగిలించాడు. ఇతని వద్ద 8ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలిం చామని ఎస్పీ తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేశ్, ఎస్ఐలు రమాకాంత్, శ్రీకాంత్, కానిస్టేబుల్స్ తిరుపతి, రాజేశ్, శ్రీనివాస్, మహిపాల్, ఉమాపతి, శివలను ఎస్పీ అభినందించారు.


దొంగను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

బావిలో పడిన బాలుడి మృతదేహం లభ్యం

సైదాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామంలో ఆదివారం ఆడుకుంటూ వెళ్లి వ్యవసాయబావిలో పడిన బాలుడు హర్షిత్ నందన(18నెలలు) మృతదేహం సోమవారం లభ్యమయింది. పోలీసులు, గ్రామస్థులు బావిలో నీటిని మోటార్లతో పూర్తిగా బయటకు తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బాలుడి తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.


హర్షిత్ నందన(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పప్పు అనిల్‌కుమార్(30) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. అన్నారం గ్రామానికి చెందిన పప్పు సారమ్మ-రాజేశం దంపతులకు కుమారుడు అనిల్‌కుమార్, కూతురు ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరగగా రాజేశం గతంలోనే అనారోగ్యంతో మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల23న సదాశివపల్లి ప్రాంతంలో అనిల్‌కుమార్ గడ్డిమందు తాగాడు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఒక్క కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మృతుడు అనిల్‌కుమార్ తల్లి సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.


అనిల్‌కుమార్(ఫైల్)

పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన జాగిలం లక్ష్మి(46) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి కూతురు రవళికి 18నెలల క్రితం ఆశన్నపల్లి గ్రామానికి చెందిన రవితో వివాహం జరిగింది. మూడు నెలలు కాపురం చేసిన రవళి ప్రస్తుతం ఇప్పలిపల్లిలోని తల్లి గారింటిలో ఉంటున్నది. రవళి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో లక్ష్మి నిత్యం కుమిలి పోయేది. ఈ క్రమంలో ఆమె ఈనెల23న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైనవైద్యంకోసం కరీంనగర్‌కు తరలించారు.అక్కడచికిత్స పొందుతూ సోమవారం లక్ష్మి మృతిచెందింది. కుటుబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జాగిలం లక్ష్మి(ఫైల్)

ఒడ్డు పైనుంచి పొలంలో పడి రైతు హఠాన్మరణం

ముస్తాబాద్, అగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు శివరాజ్(50) అనే రైతు పొలం వద్ద ఒడ్డు పైనుంచి కింద పడి మృతిచెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం పొలానికి నీరు పెట్టి వస్తానని వెళ్లిన శివరాజ్ ప్రమాదవశాత్తు కాలుజారి ఒడ్డు పైనుంచి పొలంలో బోర్లా పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


శివరాజ్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన అనీల్‌ప్రసాద్(37) అనేవ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రెండు నెలల క్రితం అనీల్ ప్రసాద్ జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డులో ద్విచక్రవాహనం నడుపుతూ కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య పూర్ణిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

తంగళ్లపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సొరుగు బాలయ్య-సంధ్య దంపతుల కూతురు సహస్ర(8) డెంగ్యూతో సోమవారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనంప్రకారం.. తంగళ్లపల్లి గ్రామం ఇందిరా నగర్‌కు చెందిన సహస్ర సిరిసిల్లలోని ఓ ప్రైవేటుపాఠశాలలో రెండోతరగతి చదువుతోంది. నాలుగురోజుల క్రితం సహస్ర జ్వరం బారిన పడింది. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమంగా మారింది. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్ అని తేలింది. చికిత్స పొందుతూ సహస్ర సోమవారం మృతిచెందింది.


సహస్ర(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు లోని కొత్తపల్లి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమా దంలో గంగాధర మండలం గోపాల్‌రావుపల్లికి చెందిన పోతరవేని కొమురయ్య(73) మృతిచెందా డని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కొము రయ్య బైక్‌పై వెనుక కూర్చున్నాడని, ముందున్న బైక్‌ను ఢీకొనడంతో ఎగిరికింద పడి తీవ్రంగా గాయపడ్డాని పేర్కొన్నారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొమురయ్య మధ్యా హ్నం మృతి చెందాడని, కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటోలో నుంచి కింద పడి డ్రైవర్ మృతి

జగిత్యాల క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి కింద పడి జగిత్యాల జిల్లా కేంద్రంలోని నూకపెల్లి హౌజింగ్ కాలనీకి చెందిన డ్రైవర్ షేక్ రజాక్(38) మృతిచెందాడు. రజాక్ జగిత్యాల కొత్తబస్టాండ్ ప్రాంతంలో తన ఆటోను ఆదివారం రాత్రి నడుపుతూ కింద పడిపోయాడు. తీవ్ర గాయాలై జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య రిజ్వాన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి పలువురి పరామర్శ


కవ్వంపల్లిని పరామర్శిస్తున్న వివిధ పార్టీల నాయకులు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణను వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు సోమవారం పరామర్శించారు. ఆరు రోజుల కిందట ఎమ్మెల్యే సోదరుడు కవ్వంపల్లి రాజేశం అనారోగ్యంతో మరణించారు. సోమవారం కరీంనగర్‌లోని వాల్మీకినగర్‌లో ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు, బూడిద సదాశివ ఉన్నారు.

డీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, జగిత్యాల జిల్లాకాంగ్రెస్ ముఖ్యనేత జువ్వాడి నర్సింగరావు, కిమ్స్ రవీందర్ రావు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఈర్ల కొమురయ్య, కాంగ్రెస్ నాయకులు జైపాల్, జొన్నల రమేష్, మాదాసు శ్రీనివాస్, కూడలి దామోదర్, గజ్జెల స్వామి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రబెల్లి రవీందర్, టీడీపీ ఆర్టీఐ విభాగం జిల్లాఅధ్యక్షులు దాసరి రామకృష్ణారెడ్డి, జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ దేశినికోటి, పార్టీ నాయకులు దొంత రమేష్, జిల్లెల్ల తిరుపతిగౌడ్, మిడిదొడ్డి రాజు ఉన్నారు.

కిలాడీ దంపతుల అరెస్ట్

- వస్త్ర పరిశ్రమ పేరుతో రూ.1.10 కోట్లు వసూలు చేసి ఉడాయింపు

కోరుట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోరుట్లపట్టణంలో వస్త్రపరిశ్రమ స్థాపిస్తున్నానని దానిలో పెట్టుబడులు పెట్టాలని పలువురి వద్ద రూ.1,10,40,000 వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న కిలాడీ దంపతులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను కోరుట్ల ఎస్ఐ చిరంజీవి సోమవారం వెల్లడించాడు. కోరుట్ల పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతానికి చెందిన రహమతి బేగం, మహమ్మద్ గౌసుద్దీన్‌లు 2023 సంవత్సరంలో కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారి వద్ద వస్త్ర పరిశ్రమ పెడుతున్నామని, అందులో వాటా ఇస్తామని డబ్బులు వసూలు చేశారు. అనంతరం నిందితులు తప్పించుకొని తిరుగుతుండగా బాధితులు 2023లో కోరుట్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసుల దర్యాప్తులో పరారీలో ఉన్న రహమతి బేగం ఆమెభర్త గౌసుద్దిన్ వాజిద్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 24న అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. 2023 నమోదు చేసిన కేసులో రహమతి బేగం, మహమ్మద్ గౌసుద్దీన్ దంపతులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పలువురి వద్ద తీసుకున్న డబ్బులతో రహమతి బేగం కుమారుడిని చదువుల కోసం లండన్‌కు పంపించి హైదరాబాదులో విలాసమతమైన జీవితం గడుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గతంలో కూడా రహమతి బేగంపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌తో పాటు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

తండ్రి మందలించాడని మనస్తాపంతో తనయుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని తండ్రి మందలించడంతో మనస్థాపం చెందిన తనయుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన గుగులోతు లక్ష్మీ- బాపురావు దంపతులకు ముగ్గురు కొడుకులు నరేశ్, అనిల్, నవీన్, కూతురు సంగీత ఉన్నారు. చిన్న కొడుకు నవీన్(24) రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లి ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 21న వివాహ వేడుకలకు హాజరైన యువకుడు మద్యం మత్తులో ఇంటికి చేరుకున్నాడు. మద్యం తాగవద్దని తండ్రి బాపురావు మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన నవీన్ అదేరోజు పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న నవీన్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.


నవీన్(ఫైల్)

కేంద్ర ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదు

గణేశ్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఓట్లను దొంగలించిన ప్రభుత్వంగా పేరుగాంచిన కేంద్ర ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర సెక్రెటరీ, గాంధీగ్లోబల్ ఫ్యామిలీజ్ఞాన్ ప్రతిష్ఠ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మెంతుల శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. ఓట్ చోర్ మోదీ హఠావో దేశ్‌కి బచావో అనే నినాదంతో మూడు రోజులుగా గీతాభవన్ చౌరస్తా వద్ద చేపట్టిన రిలేనిరాహారదీక్షను సోమవారం విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ పెద్దలు విచ్చలవిడిగా ఓట్లను దొంగిలిస్తున్నారని ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ స్పందించి జాబితాను తొలగించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లాఅధ్యక్షుడు తాజుద్దీన్ దీక్షకు సంఘీభావం తెలిపారు. యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోయిన కృష్ణబాబు, కిమ్‌ఫహద్, సయ్యద్‌సజాద్, తాళ్లపల్లి శ్రీకాంత్, అజీమ్,ఎల్కపెల్లిసిద్ధార్థ, పురుషోత్తం,వడ్డేపల్లి విష్ణువర్ధన్, ఉమ్మెత్తలా ఆశీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న సీనియర్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి

కల్వచర్లలో భారీ చోరీ

- 15 తులాల బంగారం ● 20 తులాల వెండి అపహరణ

రామగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధి గొల్లపల్లి ఐవోసీ పెట్రోల్ బంక్ సమీపంలోని గడల రాంబాబు ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తాళంవేసిఉన్న ఇంటిని గుర్తించిన దొంగలు ప్రధాన ఇంటిద్వారం తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని పదిహేను తులాల బంగారం, 20తులాల వెండిచోరీ చేశారు. శుక్రవారం రాంబాబు భార్య పావనితో కరీంనగర్‌లోని అత్తారింటికి వెళ్లారు. రాంబాబు తల్లిలక్ష్మి శనివారం ఉదయం కూతురు సుమలత అనారోగ్యంతో ఉన్న కారణంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ వెళ్లింది. సోమవారం సాయంత్రం లక్ష్మి ఇంటికిరాగా తాళంపగిలి ఉండడాన్ని గమనించింది. చుట్టుపక్కల వారితో పాటు కొడుకు రాంబాబుకు సమాచారం ఇచ్చింది. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనస్థలాన్ని మంథని సీఐ రాజు, ఎస్సై దివ్యలు పరిశీలించి కేసు నమోదు చేశారు.


విచారణ చేస్తున్న ఎస్సై దివ్య

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తంగళ్లపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన డీసీఎం వ్యాన్‌డ్రైవర్ కొంగరి నరేష్(35) తమ బంధువు అంచక్రియలకు హాజరై ద్విచక్రవాహనంపై సిరిసిల్ల నుంచి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బోలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. బోలేరో డ్రైవర్‌ను అదపులోకి తీసుకున్నట్లు తెలి సింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామ చెరువులో ట్రాక్టర్ బోల్తాపడి ఓర్సు లింగయ్య (56) అనేవ్యక్తి సోమవారం మృత్యువాతపడ్డాడు. పోలీస్‌లుతెలిపిన వివరాల ప్రకారం.. గంద్రపల్లికి చెందిన లింగయ్య అదే గ్రామంలోని రామకృష్ణ అనే రైతు పొలంలో నాట్లు వేసేందుకు ట్రాక్టర్‌లో కూలీలను తీసుకువెళ్లాడు. వారిని పొలం వద్ద దింపి చెరువు కట్టపై నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చెరువులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లింగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు లింగయ్య కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

శభాష్ చికిత



- ప్రపంచ యూత్ చాంపియన్ షిప్ సాధించిన భారత తొలి ఆర్చరీ క్రీడాకారిణిగా రికార్డు
- ఎలిగేడు మండల వాసి ఘనత


ఎలిగేడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామానికి చెందిన యువతి క్రీడారంగంలో అరుదైన ఘనత సాధించింది. కెనడాలో జరిగిన ఆర్చరీ పోటీల్లో తానిపర్తి చికిత ప్రపంచ స్థాయి విజేతగా నిలిచి భారత దేశ కీర్తిని నిలబెట్టింది. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత ఆర్చరీలో బంగారు పతకం సాధించి భారత తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. సుల్తాన్‌పూర్ గ్రామంలో వ్యవసాయం చేసుకునే తానిపర్తి శ్రీలత శ్రీనివాస్‌రావు దంపతులకు కూతురు చికిత, కుమారుడు యశ్వంత్‌లు ఉన్నారు. చికిత కరీంనగర్ నగునూర్‌లోని ఎస్‌పీఆర్ పాఠశాలలో పదో తరగతి, గర్రెపల్లిలో ఇంటర్మీడియట్, పంజాబ్‌లోని ఎల్‌పీ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లో మక్కువతో ఆర్చరీపై ఆసక్తి పెంచుకుంది. ఆర్చరీలో రాణించాలనే పట్టుదలతో కరీంనగర్‌లోని సిటి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంది. కృషి పట్టుదలతో ఆర్చరీ క్రీడలో నైపుణ్యం సాధించి, రెండు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలను సాధించింది. ఈ ఏడాదిలో జరిగిన ఆసియా కప్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకాన్ని చేజార్చుకుంది. ఈ నెల 24న కెనడాలో ముగిసిన ఆర్చరీ ప్రపంచ చాంపియన్ షిప్ కాంపౌండ్ విభాగం అండర్ 21లో ప్రత్యర్థులను మట్టికరిపించి బంగారం పతకం సాధించి విశ్వవిజేతగా నిలిచింది. ఆర్చరీ క్రీడా విభాగంలో భారత్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించి దేశ ప్రతిష్ఠను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన చికితను ప్రజలు అభినందిస్తున్నారు. సుల్తాన్‌పూర్ గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. చికిత సోదరుడు యశ్వంత్ ఆర్చరీ క్రీడలో జాతీయ స్థాయిలో రాణిస్తూ రాష్ట్రానికి గుర్తింపు తీసుకువస్తున్నారు. క్రీడా కోటాలో యశ్వంత్ బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీట్ సాధించి విద్యనభ్యసిస్తున్నాడు.





కెనడాలో బంగారు పతకం అందుకుంటున్న చికిత

డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర చైర్మన్‌గా శ్రీనివాస సుదర్శన్



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర చైర్మన్‌గా చొప్పదండి మండలం గుమ్లాపూర్‌కు చెందిన శిరిశనహళ్ శ్రీనివాస సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ హబ్సిగూడలో ఆదివారం రాత్రి ధూప దీప నైవేద్య పథకం కింద ఉన్న ఆలయాల అర్చకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అర్చకుల సంక్షేమం కోసం కృషి చేస్తా నన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెరంబుదూరు శ్రీకాంతాచార్యులు, శఠగోపం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

కరీంనగర్ నుంచి ఆర్టీసీ టూర్ బస్సు

భగత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బస్టాండ్‌లో ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు బస్సు బయల్దేరుతుందని, అన్నవరం, పిఠాపురం, శక్తిపీఠం, సింహాచలం, వైజాక్ రిషికొండ బీచ్, ద్వారక తిరుమల క్షేత్రం దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం 31వ తేదీ ఆదివారం కరీంనగర్ చేరుకుంటుందని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు రూ.3500, పిల్లలకు రూ.2625 చొప్పున టికెట్ ధర ఉంటుందని, వివరాలకు 7382849352, 9959225920 సంప్రదించాలని సూచించారు.

మత్స్యకారుడి వలకు చిక్కిన 25కిలోల చేప



తిమ్మాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ మానేరు జలాశయంలో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడికి 25కిలోల చేప వలకు చిక్కింది. మండలంలోని ఇందిరానగర్ గ్రామం సంగంపల్లికి చెందిన మత్స్యకారుడు కూన సంపత్ ఆదివారం మానేరు జలాశయంలో చేపల కోసం వలలు వేశాడు. సోమవారం ఉదయం వలలు తీస్తున్న క్రమంలో అందులో ఓ భారీ బొచ్చ చేప చిక్కింది. దాని బరువు 25కిలోలకు పైగా ఉన్నట్లు తెలిపాడు. రామకృష్ణ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి రూ.3500లకు విక్రయించినట్లు తెలిపాడు. చాలాకాలంగా చేపలుపడుతున్నా ఇంత పెద్ద చేప ఎప్పుడు చిక్కలేదని, చాలా సంతోషంగా ఉందని మత్స్యకారుడు సంపత్ తెలిపాడు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో చేపట్టే పలు అభివృద్ధి పనులపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించనున్నట్లు ఆలయ పీఆర్వో సోమవారం ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రెవెన్యూ, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావ్, దేవదాయ శాఖ గౌరవ సలహాదారు గోవింద్‌హరి, ఆర్కిటెక్ట్, స్థపతులు ఆలయ ఇంజనీర్ అధికారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

కార్యకర్తలను కడుపులో పెట్టుకుంటాం

- బీఆర్‌ఎస్ ఒక దోపిడీ పార్టీ...
- ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

కరీంనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గంగాధర మం డల శివారులోని వెంకటాయపల్లిలో ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీని అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేశారన్నారు. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. కష్టపడి పనిచేసేవారికి పదవులు దక్కుతాయని, పార్టీ టికెట్లు వస్తాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్ష కోట్ల రూపాయలు గోదావరి పాలు చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు. పదేళ్లలో కేటీఆర్ 10 వేల కోట్లు విదేశీ పెట్టుబడులు తీసుకు వస్తే, 20 నెలల కాలంలో మంత్రి శ్రీధర్‌బాబు లక్షా 78 వేల కోట్లు పెట్టుబడులు తీసుకు వచ్చారని తెలిపారు. త్వరలో రాష్ట్ర యువతకు 50 వేల ఉద్యోగాలు రాబోతు న్నాయని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ జనహిత యాత్ర ప్రజా సమస్యలను తెలుసు కోవడానికి చేస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విప్ ఆది శ్రీనివాస్

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని విప్ ఆది శ్రీనివాస్ కార్యకర్తలకు సూచించారు. ప్రజాపాలనలో కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని దేశంలో ముందు వరసలో నిలుపుతున్నారని అన్నారు.

కష్టపడిన కార్యకర్తకు బీ ఫాం ఇస్తాం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కష్టపడిన కార్యకర్తలకు బీ ఫాం ఇస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జనహిత పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మరో పదేళ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండబోతుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్తను గెలిపించుకుంటామన్నారు.

కాంగ్రెస్‌కు కంచుకోట కరీంనగర్

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి జిల్లా కంచుకోటగా నిలువబోతోందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. గడీల పాలనను బద్దలు కొట్టి ప్రజాపాలను తీసుకొచ్చామని, మతం పేరిట దేశాన్ని ఏలుతున్న బీజేపీని భూస్థాపితం చేద్దామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్తలను గెలిపించుకుని బీజేపీ, బీఆర్‌ఎస్‌కు గుండు గీయిద్దామన్నారు.

వసతి గృహంలో కాంగ్రెస్ నేతల శ్రమదానం

గంగాధర: జనహిత పాదయాత్రలో భాగంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు గంగాధర ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహంలో శ్రమదానం నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు హాస్టల్‌కు చేరుకుని ఐదు బృందాలుగా విడిపోయారు. ఒక బృందం మట్టిని ఎత్తి గుంతలు పూడ్చితే, మరో బృందం ప్రహరీకి రంగులు వేసింది, మరో బృందం కిచెన్ గార్డెన్ నిర్మించి మట్టి పోసి మొక్కలు నాటింది. మంత్రి పొన్నం ప్రభాకర్ హాస్టల్‌కు రావడంతోనే ఎదురుగా ఉన్న విద్యార్థులను పలకరించారు. పారచేతపట్టి మట్టిని తట్టలో ఎత్తారు. ఎత్తిన మట్టిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గుంతల్లో పోస్తూ పూడ్చారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గోడకు సున్నం వేయగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మట్టి ఎత్తారు. విద్యార్థుల స్నానాల గదులను శుభ్రం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న కిచెన్ గార్డెన్ నిర్మించి మట్టి పోశారు. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఏఐసీసీ కార్యదర్శి రుద్ర సంతోష్ పాల్గొన్నారు.

సర్వోదయ సమాజ్ సేవాదళ్ భజన..

కరీంనగర్ అర్బన్: గంగాధరలోని ఎస్సీ గురుకుల వసతి గృహంలో మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో సోమవారం సర్వోదయ సమాజ్ సేవాదల్ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కీర్తనలు ఆలపించారు.

ఎస్సారెస్పీకి 29,907 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం 29,907 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 29,907 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది. మూడు రోజులుగా ప్రాజెక్టుకు చెందిన గేట్లను పైకి ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతుండగా ఇన్‌ఫ్లో తగ్గడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి వరద గేట్లను మూసివేసి దిగువ గోదావరికి నీటి విడుదలను నిలిపివేశారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎల్‌ఎండీకి నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

బోయినపల్లి ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం వరకు 18,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 14, 850, గాయత్రీ పంప్ హౌస్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీరు వస్తోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27.741 టీఎంసీలకు 17.141 టీఎంసీల మేరకు నీరు ఉంది.

- **ఇల్లంతకుంట :** ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మధ్యమానేరు ద్వారా 9,600 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 9,900క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.41 టీఎంసీల నీరు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

10 టీఎంసీలకు చేరిన ఎల్‌ఎండీ నీరు

తిమ్మాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువన శ్రీ రాజరాజేశ్వర జలాశయం (ఎంఎంఆర్) నుంచి కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలోకి నీటి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో ఎల్‌ఎండీలోకి ఎగువ ఎంఎంఆర్ నుంచి 9,704క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎల్‌ఎండీలో నీరు 9.905 టీఎంసీలకు చేరింది. ఎల్‌ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు. ఎల్‌ఎండీ నుంచి మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 236 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది. గత ఏడాది ఇదే రోజు ఎల్‌ఎండీలో 6.153 టీఎంసీల నీరు ఎల్‌ఎండీలో నిల్వ ఉంది. కాగా ఎంఎంఆర్, మోయతుమ్మెద వాగు నుంచి 9644క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లోలు వస్తున్నాయి.

గాయత్రి పంపుహౌస్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

ఎస్సారెస్పీతో కలిపి 20,650 క్యూసెక్కుల నీరు

మిడ్ మానేరుకు తరలింపు

రామడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక్క పంపు ద్వారా 3150క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేశారు. అది నేరుగా వెళ్లి వరద కాలువలో కలుస్తోంది. ఎస్సారెస్పీ నుంచి 18,500 క్యూసెక్కుల నీరు వరద కాలువలో 99వ కిలోమీటర్ల వద్ద కలుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం 20,650 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. అయితే మిడ్‌మానేరకు 20,650 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. వరదకాలువ నిండుకుండలా తయారై కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

రాజన్న ఆలయంలో రద్దీ

రాజన్నను దర్శించుకున్న జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. రాజన్నకు ఎంతో ఇష్టమైన సోమవారం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని గ్రేటర్ హైదరాబాద్ నగర మున్సిపల్ మేయర్ విజయలక్ష్మి దర్శించుకున్నారు. సోమవారం ఉదయం రాజన్న ఆలయానికి వచ్చేసిన ఆమె రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. వారి వెంట ప్రొటోకాల్ ఏఈవో గోవిందుల అశోక్ కుమార్, సూపరింటెండెంట్ వేదాంతం శ్రీకాంతచార్యులు, ఓడెపు వెంకటప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్‌యాదవ్ ఉన్నారు.

కొండగట్టులో విజయలక్ష్మి పూజలు

మల్యాల: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి సోమవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. జీహెచ్‌ఎంసీ మేయర్‌కు అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న జీహెచ్‌ఎంసీ మేయర్



వేములవాడ ఆలయ ఆవరణలో భక్తులు

మట్టి గణపతే మహా గణపతి

పీవోపీతో పర్యావరణానికి హాని

ఇల్లందకుంట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పంచభూతాలతో ఏర్పడినది. భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పును దేవుళ్లుగా కొలవడం.. వేప, తులసి మొదలగు ప్రకృతిలోని లభించే వాటిని ఆరాధించడం హిందూ సంప్రదాయంలో ఉంది. కొద్ది కాలంగా సాంప్రదాయానికి విరుద్ధంగా పర్యావరణానికి హాని కలిగేలా ఉత్సవాలు జరుగుతున్నాయి. శబ్ద, వాయు, జల ఇతర రకాల కాలుష్యాలు చేస్తూ మనకు తెలియకుండానే ప్రకృతి వినాశ కారకులమవుతున్నాం. ఇది పట్టణాల్లో మొదలై పచ్చని పల్లెలకు వ్యాపించింది. గ్రామాలను కాలుష్య స్థావరాలుగా మారుస్తున్న తీరు మనకు కనిపిస్తున్నది. వినాయక విగ్రహాలను ఆకర్షణీయ రంగులతో పెద్దఎత్తున రూపొందిస్తూ వేడుకలు చేసుకుంటున్నారు. సాంప్రదాయం ప్రకారం వినాయకుడి ప్రతిమను మట్టితో తయారు చేసి భక్తి శ్రద్ధలతో పూజించేవారు. ఆ తర్వాత వినాయకుడి ప్రతిమను నీటిలో నిమజ్జనం చేసేవాళ్లు.

పీవోపీ గణపతులు..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతి విగ్రహాలు కాకుండా మట్టి గణపతి విగ్రహాలు వాడాలని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకం తగ్గించాలని సూచిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రజల తీరు మారింది. మట్టి గణపతిని వాడాలనే ఆకాంక్ష పెరిగింది. కృత్రిమ రసాయన పదార్థాలతో తయారు చేసిన గణపతి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం మాత్రం ఇంకా జరుగుతూనే ఉంది. ఇది తీవ్రమైన జల కాలుష్యానికి దారి తీస్తున్నది.



పీవోపీ హానికారక రసాయనాలు

గాదె గుణసాగర్, ఇల్లందకుంట


ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ)లో కాల్షియం, సల్ఫేట్, హేమి హైడ్రేట్ రసాయనాలుంటాయి. హాని కారక రంగుల వల్ల నిమజ్జనం చేసిన చెరువు, జలవనరులు కలుషితమవుతాయి.

మట్టి విగ్రహాలే మేలు

మండల జయమూర్తి, సిరిసేడు



మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమ 45 నిమిషాల్లో నీటిలో కరిగిపోతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మాత్రం నీటిలో కరు గకుండా కొన్ని నెలల పాటు ఉండిపోతాయి. మట్టి వినాయకుడిని పూజించడం ద్వారా రీసైక్లింగ్ అనే ప్రకృతి విధానాన్ని మనం పాటించవచ్చు.



మానసిక వికలాంగుల పాఠశాలకు రూ.50 లక్షలు

ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

తిమ్మాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50లక్షల నిధులను మంజూరు చేసిందని ట్రస్ట్‌చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎల్‌ఎండీకాలనీలో గల మానసిక వికలాంగుల పాఠశాలలో ఆయన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ 125మంది మానసిక వికలాంగులకు వారిని చూసుకోవడానికి మరో 35 మంది సిబ్బంది ఉన్నారన్నారు. ఈ ట్రస్ట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తుండేవన్నారు. కానీ గత రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. కేంద్రానికి 2023- 2024వ సంవత్సరానికి రూ.80లక్షల నిధుల కోసం వినతులు పంపిస్తే రూ.35లక్షల నిధులు మంజూరు చేసిం దని, ఈ ఏడాది ఇంకా నిధులు విడుదల కాలేదన్నారు. సెప్టెం బరు 10న మానసిక వికలాంగుల పాఠశాలలో హైదారాబాద్ లోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో పాఠశాలలోని వికలాంగుల పిల్లలతోపాటు ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలకు కొత్త బస్సు ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జి కొమురెళ్ల రెడ్డి, జి భగవాన్, మదుసూదన్‌రావు, బి వెంకటయ్య, ప్రిన్సిపల్ సతీష్, ఏవో బాల్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు

గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఇండిపెండెన్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించన గణేష్ శోభయాత్రకు హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు.

సంపన్నులకే అమలవుతున్న రాజ్యాంగం

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : 75 సంవత్సరాల రాజ్యాంగ ఫలా లు సంపన్నులకే అందుతున్నాయని, రాజ్యాంగ ద్రోహులు దేశంలో రాజ్యామేలు తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో సోమవారం సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్మారక సెమి నార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరీతో పాటు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగం ఎదుర్కొం టున్న సవాళ్లు అనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు మాట్లాడారు. దేశంలో 200 మంది కోటీశ్వరుల ఆస్తులు దేశంలోని 40 శాతం మంది ప్రజల ఆస్తితో సమానంగా ఉందన్నారు. ఒక శాతం మంది చేతుల్లో 50 శాతం ఆస్తి పోగు పడిందన్నారు. బీజేపీ 11 ఏళ్ల పాలన సామాజిక ఆర్థిక అంతరాలను మరింతగా పెంచిందన్నారు. ఈ సెమినార్‌లో జిల్లా కమిటీ సభ్యులు మల్లారపు అరుణ్‌కుమార్, ఎరవెల్లి నాగరాజు, గన్నెరం నర్సయ్య, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్, గురజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్‌చంద్ర, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్, సిరిమల్లే సత్యం, మార్వాడి సుదర్శన్; గాంతుల మహేష్, మనోజ్ కుమార్; రూప, కూచన శంకర్; కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అన్నదానం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప జన్మదిన ఉత్తర నక్షత్రం పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల అఖిల భారత అయ్యప్ప దీక్ష సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండులో అంజలి- శేఖర్ దంపతుల సహకారంతో ప్రయాణీకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు మధు, దేవరాజు, శ్రీనివాస్, చంద్రమోహన్‌రెడ్డి, రవి, రాజు, వెంకటేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ ఏర్పాట్ల పరిశీలన

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా జిల్లా గ్రంథాలయం ఎదుట ఏర్పాటు చేస్తున్న మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రిభాయ్ పూలే దంపతుల విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ ఏర్పాట్లను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పీటీసీ రాజయ్య సోదరుడు నర్సయ్య, కాంగ్రెస్ నాయకుడు మొడుసు శంకరయ్య భార్య వెంకటమ్మల కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు.

- ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తండ్రీకొడుకులు గూడుమియా, ఖలీంలు అనారోగ్యంతో చనిపోవడంతో ఆ కుటుంబాన్ని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి పరామర్శించారు. 50 కిలోల బియ్యం వితరణ చేశారు. నారాయణపూర్‌లో మధుసూదన్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు పరామర్శించారు.

● గంభీరావుపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు జంగం రాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేషాల శ్రీనివాస్‌లు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి నాయకులు ఉన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య కీలకం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు పూర్వ ప్రాథమిక విద్య కీలకమని ఎస్ఐ లక్ష్మణ్, ఎంఈవో శ్రీనివాస్‌లు అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యార్థుల కోసం ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన గదిని హెచ్ఎం ఉదయలక్ష్మీ, ఏఏపీసీ చైర్‌పర్సన్ స్వర్ణలతలతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ముస్తాబాద్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి శివశంకర్, సభ్యులు రాజేందర్‌రావు, సత్యం, స్వామి, శంకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానయోగాతో ఆరోగ్యం

కోనరావుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధ్యానం యోగాతో ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి దూరం అవుతుందని మెడిటేషన్ నిర్వాహకుడు మంచాల గణేష్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు విద్యార్థులకు ఆరోగ్యం పట్ల సోమవారం అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు యోగా, ధ్యానం ప్రతిరోజు అలవాటు చేసుకోవాలని, అప్పుడే మానసిక ఒత్తిడి దూరమై ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సుధాకర్, ఝాన్సీ, లక్ష్మీ, వేణు, అశోక్, ప్రసాద్, రమేష్, తిరుమలేశ్వర్, భరత్ తదితరులు ఉన్నారు.

వృద్ధుడికి గాయాలు

చందుర్తి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఎస్.కె గఫాషా అనే వృద్ధుడు గ్రామంలోని రహదారిపై గాయాలతో స్పృహతప్పి పడిఉండడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో సోమవారం ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం గ్రామం చెందిన గఫాషా అనే వృద్ధుడు మెడికల్ షాప్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వచ్చాడు. గ్రామంలోని కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిపై స్పృహ కోల్పోయి రోడ్డుపై పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కృత్యాధార బోధనతో మంచి ఫలితాలు

తంగళ్లపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కృత్యాధార బోధన పద్ధతితో మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంపీడీవో లక్ష్మీనారయణ అభిప్రాయపడ్డారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఎంఆర్సీ భవనం అవరణలో మండల స్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను ఎంపీడీవో లక్ష్మీనారయణ, ఎంఈవో రాజు నాయక్‌లతో పాటు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు శంకర్‌నారయణ, రవీందర్, విద్యాసాగర్, అనురాధ, ఆరాధన, ఉపేందర్‌లు పరిశీలించి బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోదన పద్ధతులు పాటిస్తున్నారని అన్నారు. విద్యార్థుల నుంచి ఆశించిన మేర ఫలితాలు వస్తాయని అన్నారు. అనంతరం పాఠశాల వారీగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

● సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



ప్రజావాణికి తరలివచ్చిన ప్రజలు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సోమవారం ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు జిల్లా కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడింది. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 206 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు77, హౌసింగ్ శాఖకు 30, డీఆర్‌డీవోకు 26, జిల్లా విద్యా శాఖకు 12, వేములవాడ దేవస్థానం ఈవోకు 9, ఉపాధి కల్పన శాఖకు 8, జిల్లా సంక్షేమాశాఖ అధికారికి 6, ఎస్డీసీకి 6, మైనార్టీ సంక్షేమశాఖ అధికారికి 5, సిరిసిల్ల మున్సిపాలిటీకి5, జిల్లా పంచాయితీ అధికారికి 4, ఎస్పీ కార్యాలయానికి 3, జిల్లా వ్యవసాయశాఖకు 2, డీసీఎస్‌వోకు 2, లీడ్‌బ్యాంక్ మేనేజర్‌కు 2, జిల్లా నీటి పారుదల శాఖకు 2, జిల్లా రవాణా శాఖకు 2, జిల్లా వైద్యాధికారికి1, ఎస్సీ కార్పొరేషన్‌కు 1, డీవైఎస్‌వోకు 1, పశుసంవర్ధకశాఖకు 1, ఈడీఎంకు 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

రంగనాయక్ సాగర్‌నుంచి కాలువ నిర్మించండి

ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్, బోటు మీది పల్లె, దాచారం, రామోజీపేట, చిక్కుడోని పల్లె గ్రామాలకు సాగు నీరును అందించేందుకు రంగనాయక సాగర్‌నుంచి కాలువను నిర్మించాలని గ్రామస్థులు సోమవారం సిరిసిల్ల జిల్లాకలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు అమ్ముల అశోక్, బాలయ్య, మల్లేశం, కొమురయ్య పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌ల కమీషన్ చెల్లించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రేషన్ డీలర్లకు ఐదు నెలల నుంచి కమీషన్ రావడం లేదని జిల్లా కలెక్టర్ స్పందించి కమీషన్ ఇప్పించి రేషన్ డీలర్లను ఆదుకోవాలని జిల్లా చౌకధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డిమల్ల హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సిరిసిల్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్, మండలాల అధ్యక్షు లు, ప్రధాన కార్యదర్శులు మందాల ప్రసాద్‌బాబు, రాజ్యలక్ష్మీశ్రీనివాస్, ఎర్ర నర్సయ్య, గోపాల్, ఒద్యారం దేవయ్య, శోభన్‌బాబు, శ్యాంసుందర్, చంద్రకళ అంజ య్య, వెంకట్‌రెడ్డి, పాతూరి సురేష్ పాల్గొన్నారు.

నా కుమారులు పోషించడం లేదు

-రాగుల సత్తగంగవ్వ, రుద్రంగి



రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నాకు ఇద్దరుకుమారులు ఉన్నారు. మాకు ఉన్న 8ఎకరాల వ్యవసాయ భూములను ఇద్దరు కుమారులు రాగుల నర్సయ్య, రాగుల బాలకిషన్‌లకు 4 ఎకరాల చొప్పున ఇచ్చాం. నా భర్త సత్తయ్య మరణించడంతో నేను ప్రస్తుతం 80 సంవత్సరాల వయస్సులో ఒంటరిగా జీవిస్తున్నాను, నా ఇద్దరు కుమారులు నన్ను పోషించడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

పీఎం విశ్వకర్మ రుణం ఇప్పించండి

- కోడుముంజ రవీందర్, పెద్దలింగాపూర్



ప్రధాన మంత్రి విశ్వకర్మ రుణాలను ఇప్పించాలంటూ ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో విశ్వకర్మ కులానికి చెందిన మాకు పీఎం విశ్వకర్మ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



కలెక్టరేట్‌కు తరలివచ్చిన పెద్దలింగాపూర్ రైతులు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన రేషన్ డీలర్లు

అంగన్‌వాడీల్లో ఆకుకూరల సాగు

(5వ పేజీ తరువాయి)

పాఠశాల గదుల్లో కొనసాగుతున్నాయి. ఇందులో పోషన్ వాటిక పథకానికి అనువుగా సొంత భవనంలోని153 కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల్లో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేయనున్నారు. బహిరంగ మార్కెట్లో అవసరమైన కూరగాయలు రసాయన ఎరువులు వాడి పండిస్తున్నవే దొరుకుతున్నాయి. అంగన్‌వాడల్లో కూరగాయలను సేంద్రీయ ఎరువుల ద్వారా పండించడం ద్వారా నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తాయి. దీని ద్వారా నాణ్యమైన పోషకాహారం అందించే వీలు ఏర్పడుతుంది.

ఒక్కో కేంద్రానికి రూ. 10 వేల నిధులు

పోషన్ వాటిక పథకంలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయడానికి గుర్తించిన అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి రూ. 10 వేల నిధులు అందించనున్నారు. జిల్లాలో 153 కేంద్రాలకు రూ. 15.30 లక్షల నిధులు వస్తాయి. మొదటి విడతగా ఒక్కో కేంద్రానికి రూ. 5 వేల చొప్పున కేంద్రం నిధులను రాష్ట్రానికి జమ చేసింది. ఈ నిధుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రంలోని ఖాళీ స్థలాన్ని చదును చేయడం, సేంద్రియ ఎరువులు ఇతర అవసరాలకు ఉపయోగించుకోవచ్చు.

తాజా కూరగాయలతో పౌష్టికాహారం

- లక్ష్మీరాజం జిల్లా సంక్షేమ అధికారి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ వాటికలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే విత్తన ప్యాకెట్ల పంపిణీ జరిగింది. తాజా కూరగాయలతో పౌష్టికాహారాన్ని చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందించేందుకు అవకాశం ఉంటుంది. టీచర్లకు, ఆయాలకు ఉద్యానవన శాఖ ద్వారా శిక్షణ ఇప్పిస్తాం.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

ఇల్లంతకుంట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి జన్మదినం ఉత్తరనక్షత్రం సందర్భంగా పూజలు, అన్నదానం చేపట్టారు.

మహిళా సాధికారతకు పాటుపడాలి

గంభీరావుపేట, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం మహిళా సాధికారత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిత సెల్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వాణి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఆంజనేయులు, టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో ధర్మపురి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ లక్ష్మణ్‌లు అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం మండపాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను బదనాం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



బీఆర్ఎస్ భవన్‌లో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఆర్డర్ల బకాయిలను ఎగొట్టి పోయిందని బీఆర్ఎస్‌ను, కేటీఆర్‌ను కాంగ్రెస్ పార్టీ బదనాం చేస్తోందని తెలంగాణ టెక్స్‌టైల్ పవర్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్దాలు చెప్పుకుంటూ పోతుంటే నిజమేమో అని ప్రజలు అపోహపడే అవకాశాలున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆరున్నర సంవత్సరాల కాలంలో రూ. 3,312కోట్లు ఆర్డర్లు ఇచ్చిందని 2023 అక్టోబర్ 19 నాటికి రూ. 200కోట్ల 31లక్షలు బకాయిలు ఉన్నట్లు టెస్కో తెలిపిందన్నారు. రూ. 480 కోట్లు బకాయిలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. రూ. 1000కోట్ల ఉత్పత్తి ఇచ్చే ప్రభుత్వం పోయి రూ. 280 కోట్లు ఉత్పత్తి ఇచ్చే ప్రభుత్వ వచ్చిందని ఆరోపించారు. నాడు ఏడు కోట్ల మీటర్ల బట్టను ఉత్పత్తి చేసిన కార్మికులు కేటీఆర్‌పై నమ్మకంతో సిరిసిల్లకు వచ్చారని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం విశ్వాసం లేకనే వలసపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమపై అవగాహన లేకుండా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడగట్ల మురళి, మాజీ కౌన్సిలర్లు దార్ల సందీప్, గుండ్లపెల్లి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ర్యాలీ



వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



గంభీరావుపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

వేములవాడ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపి మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ డిమాండ్ చేశారు. వేములవాడ మండలం నందికమాన్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్‌తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్ తదితరులు ఉన్నారు.

● గంభీరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరిస్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గంభీరావుపేట మండలశాఖ అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● కోనరావుపేట : ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కోనరావుపేట మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ వరలక్ష్మికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సిరికొండ శ్రీనివాస్‌ను సన్మానించారు. మహిళా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ పాల్గొన్నారు.

● చందుర్తి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్ అన్నారు. చందుర్తి మండలంలో నెలకొన్న సమస్యలపై మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బిజెపి నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మండల బిజెపి అధ్యక్షులు మొకిలే విజేందర్, లింగంపల్లి శంకర్,పొంచెట్టి రాకేష్, పెరుక గంగరాజు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట తప్పాయని మండల బీజేపీ ఇన్‌చార్జి శీలం రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావులు ఆరోపించారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు

బోయినపల్లి ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కి వెళ్తే తనపై గత ఎస్సై తప్పుడు కేసు పెట్టారంటూ ఎస్సైతో పాటు ఓ కానిస్టేబుల్‌పై విచారణ జరిపించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ మహేష్ బిగితేకు, ఐజీ, డిజిపిలకు సోమవారం ఒకరు ఫిర్యాదు చేశారు. కోరెం గ్రామానికి చెందిన క్యాతం మాధవి తిరుపతిరెడ్డి దంపతులకు మరో వర్గంతో జూన్ 26న భూవివాదం తలెత్తింది. దీంతో మాధవి ఆమె భర్త తిరుపతి రెడ్డి న్యాయం కోసం ఇప్పటి ఎస్ఐ రాజకు మార్‌ను ఆశ్రయించారు. మరో వర్గంపై కేసు నమోదు చేయాలంటే కానిస్టేబుల్ రాజ్‌కు మార్ ద్వారా ఎస్సై రాజ్‌కుమార్ 25 వేల ముడుపులు ఇవ్వాలని డిమాండ్ చేశాడని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతో కానిస్టేబుల్ రాజ్‌కుమార్ నిత్యం ఫోన్‌లో వేధించినట్లు తెలిపారు. తనపై ఎస్సై కేసు నమోదు చేశారన్నారు. దీనిపై జూలై 22న హెచ్ఆర్సీని ఆశ్రయించినట్లు తెలిపారు. ఎస్ఐ రాజకుమార్ విధుల్లో చేరిన మూడు నెలల్లోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో ఎస్పీ డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. అదే ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు చేయడం మండలంలో మరోసారి ఎస్సై పేరు చర్చనీయాశంగా మారింది.

కాంగ్రెస్ నాయకుల మాటలు అర్థరహితం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తప్పుడు ఆరోపణలు చేయడం అర్థరహితమని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ కమిటి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు బారీగా మోహరించడంతో నాయకులు నిరసనలు తెలిపారు. సాయంత్రం పాత బస్టాండ్‌లోని నేతన్న విగ్రహం ఎదుట టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు మ్యాన రాంప్రసాద్, దాసరి శ్రీనివాస్, వంతడ్పుల సుధాకర్, కర్నే హరీష, ల్యాగల బాగయ్య, మోర శ్రీహరి, పల్లికొండ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. టీపీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సిద్ధమయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దిష్టిబొమ్మను లాక్కునేందుకు యత్నించారు. పోలీసులు, నాయకుల మధ్య స్వల్ప పెనుగులాట చోటు చేసుకుంది. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, బుగ్గారెడ్డి, ప్రకాశ్, బాలకృష్ణ, కిరణ్‌నాయక్, రాజిరెడ్డి, రంజిత్‌కుమార్, కుమార్, పర్శరాములు, అంజనేయులు, రాజురెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



ముస్తాబాద్‌లో మహేశ్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా ముస్తాబాద్ బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి ఆధ్వర్యంలో మహేశ్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్య దర్శి ఏదునూరి గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, చిట్నేని శ్రీనివాస్‌రావు, కరెడ్ల మల్లారెడ్డి, కస్తూరి కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

గంభీరావుపేట: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలను నిరసిస్తూ గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు వాజీద్‌హుస్సేన్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని పేర్కొంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను సోమవారం బీజేపీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, మాజీ మండలశాఖ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, నాయకులు మ్యాకల మల్లేశం పాల్గొన్నారు.

కోనరావుపేట: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు కోనరావుపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో దహనం చేశారు. బిజెపి మండల అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగిందన్నారు. బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు సరికాదు

- చెన్నమనేని వికాస్‌రావు

కోనరావుపేట : కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు సరికాదని, తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. కోనరావుపేట మండలం నాగారంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ వారు ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు.